సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



అట్టర్ ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలా?
కూటమి అట్టర్‌ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. -8లో



రాజకీయ జోక్యంతో విచారణ మమ
దువ్వూరులో గురువారం రాత్రి యూరియా అక్రమంగా తరలింపుపై అధికారులు.. రాజకీయ జోక్యంతో విచారణ మమ అనిపించారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.2/25.2

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 25.2 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్


మయూర విలాపం

మయూరాలు పురివిప్పు నాట్యమాడుతుంటే.. చూసేందుకు రెండు కళ్లు చాలవు. కానీ ఇడుపులపాయలో నెమళ్ల విలాపం చెందుతుండటం.. పక్షుల ప్రేమికులను ఆందోళన కలిగిస్తోంది. సంరక్షణ, పర్యవేక్షణ లోపంతో కొన్ని మృత్యువాత పడుతుండటం విషాదకరం. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం శీతకన్ను వేయడంతో.. ఈ పరిస్థితి తలెత్తింది.

- ఇడుపులపాయ నెమళ్ల పునరుత్పత్తి కేంద్రంపై నిర్లక్ష్యం
- తగ్గిపోతున్న మయూరాల సంఖ్య
- విష ప్రయోగంతో ఒకే సారి 9 మృతి
- మూలనపడిన ఇంక్యుబేటర్



ఇడుపులపాయలోని నెమళ్ల పునరుత్పత్తి కేంద్రం


పునరుత్పత్తి కేంద్రంలో పురివిప్పి ఆడుతున్న మయూరం

కడప సిటీ: ఇడుపులపాయలోని నెమళ్ల పునరుత్పత్తి, సంరక్షణ కేంద్రం (నెమళ్ల పార్కు)లో నానాటికీ నెమళ్ల సంఖ్య తగ్గిపోతుండటంతో.. పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ పక్షిగా నెమలికి మన దేశంలో గుర్తింపు ఉంది. అటవీశాఖ నిబంధనల మేరకు జాతీయ జంతువు పులికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో, అంతే ప్రాధాన్యతను మయూరానికి ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం అడవుల్లో నెమళ్ల సంఖ్య తగ్గిపోతుండటంతో.. ఇలాంటి కేంద్రాన్ని మరింత శ్రద్ధతో సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

105 నుంచి 31కి తగ్గిన నెమళ్ల సంఖ్య
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008 డిసెంబరు 24న ఈ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షల నిధులు కేటాయించారు. నెమళ్ల ఆరోగ్య సంరక్షణకు ఓ ఆస్పత్రి, గుడ్లను పొదిగించేందుకు ఇంక్యుబేటర్, ల్యాబ్, ఆకర్షణీయమైన షెడ్లు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో 72 నెమళ్లు (10 మగ నెమళ్లు, ఆడ నెమళ్లు 29, మిగిలినవి పిల్లలు) ఉన్నాయి. ఆ తర్వాత ఇందులో నెమళ్ల సంఖ్య 105కి చేరింది. దాదాపు ఇక్కడ పెంచి పోషించిన నెమళ్లు 400 దాకా అడవుల్లోకి వదిలే సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం 31 నెమళ్లు మాత్రమే ఈ కేంద్రంలో ఉండటం ఆందోళన కలిగించే పరిణామం.

కోళ్ల కింద గుడ్లు పెట్టి పొదిగిస్తున్న వైనం
ప్రస్తుతం నెమళ్ల పార్కులో గుడ్లు పొదిగించే ఇంక్యుబేటర్ మూలకు చేరింది. నాలుగేళ్లుగా పనిచేయకపోవడంతో కోళ్ల కింద గుడ్లు పొదిగిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పునరుత్పత్తి అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ఇది కూడా నెమళ్ల సంఖ్య తగ్గడానికి కారణంగా తెలుస్తోంది. రూ.2 లక్షల ఖరీదు చేసే ఈ ఇంక్యుబేటర్‌ను కొనకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటే.. ఏ మేరకు నెమళ్లపార్కు మీద శ్రద్ధ కనబరుస్తున్నారో అవగతమవుతోంది.

అటవీ శాఖ అధికారుల విచారణ
ఈ ఏడాది జనవరిలో ఒకేసారి తొమ్మిది నెమళ్ల మృతి చెందాయి. వీటికి పోస్టుమార్టం నిర్వహించి భూమిలో పాతిపెట్టారు. ఒకేసారి ఇన్ని నెమళ్లు చనిపోవడంతో అధికారులకు అనుమానం మొదలైంది. ఎవరో విష ప్రయోగం చేశారన్న విషయం పోస్టుమార్టంలో తేలింది. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎవరు చేశారన్నది గుర్తించడంలో ఇబ్బందిగా మారింది. ఎవరైనా చెడ్డపేరు తెచ్చేందుకు చేశారా? అనే అనుమానంతో అధికారులు ఉన్నారు.

కుందేళ్లు, లవ్‌బర్డ్స్ కూడా లేవు
ఇడుపులపాయ నెమళ్ల పార్కులో నెమళ్లే కాకుండా 25 లవ్ బర్డ్స్, 20 కుందేళ్లు కూడా ఉండేవి. ప్రస్తుతం అవి కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. సంరక్షణ సరిగా లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైనట్లు పర్యాటకులు చెబుతున్నారు.

తెలుగు రాష్ట్రాలకు ఒకే ఒక పునరుత్పత్తి కేంద్రం
రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి నెమళ్ల పునర్పత్తి కేంద్రం, సంరక్షణ కేంద్రం ఇదొక్కటే ఉంది. ఇలాంటి కేంద్రాన్ని తెచ్చుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం అనుమతి లేనిదే ఏర్పాటు చేసుకోవడం చాలా కష్టమైన పని. అందువల్ల దీనిని అతి జాగ్రత్తగా సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకానొక దశలో ఎత్తివేసే యత్నం
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నెలకొల్పిన ఈ నెమళ్ల పార్కును ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇక్కడ లేకుండా ఎత్తివేసే ప్రయత్నం చేశారు. 2016లో ట్రిపుల్ ఐటీలో కాన్వొకేషన్ కార్యక్రమానికి హాజరైనపుడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అప్పట్లో నిధులు లేని కారణంగా మూసివేత దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని తీసివేసి అటవీశాఖ అతిథి గృహంగా మార్చాలన్న నిర్ణయానికి కూడా అప్పట్లో వచ్చినట్లు తెలిసింది. ఈ విషయాన్ని 2016 డిసెంబరు 21న సాక్షి 'పాపం మయూరం' శీర్షికన కథనం ప్రచురించడంతో.. ఎక్కడ చెడ్డపేరు వస్తుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయాన్ని విరమించుకున్నారు.

సంరక్షణ లోపమా? పర్యవేక్షణ లేకనా?

ఇడుపులపాయ నెమళ్ల పార్కులో నానాటికీ నెమళ్ల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంరక్షించేవారు లేకపోవడమా? లేక పర్యవేక్షణ లోపమా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. సక్రమమైన సంరక్షణ ఉంటే నెమళ్లు ఎందుకు పునరుత్పత్తి కావడం లేదని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. సరిగా వాటికి పోషకాహారాన్ని పెడుతూ సంరక్షించుకుంటూ వెళ్లడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే అధికారులు మాత్రం అన్ని సక్రమంగానే ఉన్నాయని చెబుతున్నారు. నిధులు ఆలస్యంగా ప్రభుత్వం నుంచి అందుతున్నా.. ఇబ్బందులు లేవంటున్నారు.

సంఖ్య పెంచేందుకు చర్యలు



నెమళ్లపార్కులో నెమళ్ల సంఖ్య పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కొత్త ఇంక్యుబేటర్ కోసం నివేదికలు ప్రభుత్వానికి పంపించడం జరిగింది. త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కోళ్ల కింద గుడ్లను పొదిగించి పునరుత్పత్తి చేస్తున్నాం. తొమ్మిది నెమళ్ల మృతి చెందిన విషయంపై కేసు నమోదుతోపాటు విచారణ ప్రారంభించాం. త్వరలో నిందితులను పట్టుకుంటాం. సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తున్నాం.
-బాలసుబ్రమణ్యం, అటవీ అధికారి, వేంపల్లె

పర్యాటకుల్లో ఆందోళన



నెమళ్ల పార్కులో నెమళ్ల సంఖ్య తగ్గిపోవడంతో పర్యాటకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా గండి వీరాంజనేయస్వామిని దర్శించుకునే వారంతా ఇడుపులపాయకు వస్తున్నారు. అక్కడ నెమళ్లను చూసి చిన్న పిల్లలు ఆనందంతో కేరింతలు వేస్తారు. ఇలాంటి కేంద్రాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.
- కొండారెడ్డి, వేంపల్లె

పార్కును సంరక్షించుకోవాలి



నెమళ్లపార్కుపై అధికారులు చర్యలు చేపట్టి సంరక్షించాల్సిన అవసరం ఉంది. నెమళ్ల సంఖ్య తగ్గిపోకుండా పునరుత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే నెమళ్ల పార్కు ఒక పర్యాటక కేంద్రంగా మారడంతో దీన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.
- యు.చంద్ర ఓబుల్‌రెడ్డి, వేంపల్లె

అక్షరమే ఆయుధం

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



పత్రికా స్వేచ్ఛను హరించేలా కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తోంది. పోలీసులతో కేసులు పెట్టిస్తూ భయపెట్టాలని చూస్తోంది. ఇటీవల ఒక నాయకుడి ప్రెస్‌మీట్ కవర్ చేసినందుకు కేసు పెట్టడం దుర్మార్గం. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగేలా, ప్రజాస్వామ్య విలువలకు భంగం వాటిల్లేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పెట్టిన కేసును ఎత్తివేయాలి.
-వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎంపీ, కడప

కక్షపూరితం..దుర్మార్గం



పత్రికా స్వేచ్ఛ అనేది భావ ప్రకటన స్వేచ్ఛ అని ప్రభుత్వంలో ఉన్న వారికి తెలియంది కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)ఏ ప్రసాదించింది. ప్రజల గొంతుకైన పత్రిక పట్ల, పత్రిక ఎడిటర్ పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం ఇది మంచిది కాదు. పత్రికలో వచ్చే వార్త లేదా కథనంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చు. లేదా రిజాయిండర్ ఇవ్వవచ్చు. దానికి స్పందించకపోతే పరువునష్టం దావా వేసుకోవచ్చు. అంతేకాని భయపెట్టి తన దారిలోకి తెచ్చుకోవాలనే కుతంత్రంతో తప్పుడు కేసులు పెట్టడాన్ని సమాజం హర్షించదు.
- మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభసభ్యుడు

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పెద్దముడియంలో 9.8 మిల్లీమీటర్లు, ప్రొద్దుటూరులో 9, రాజుపాళెం 8.8, దువ్వూరు 7.4, మైదుకూరు 6, చాపాడు 5.2, కలసపాడు 5, కమలాపురం 4.6, కడప 3.8, కొండాపురం 2.8, తొండూరు 2.4, ఎర్రగుంట్లలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

వ్యాయామ విద్య అధ్యాపక అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఈనెల 16 ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఉన్న 2 గెస్ట్ ఫ్యాకల్టీకి 55 శాతం మార్కులతో బి.పి.ఎడ్., ఎం.పి.ఎడ్. జాతీయ/ఐయుటీ స్థాయి టోర్నమెంట్లలో పాల్గొనడం/పతకం గెలుచుకున్న వారు.. అలానే పి.హెచ్.డి./సెట్/నెట్ అర్హతలు ఉండాలన్నారు. యోగాలో గెస్ట్ ఫ్యాకల్టీకి ఎమ్మెస్సీ (యోగా), నెట్/సెట్ అర్హతలు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయో-డేటా, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీల సెట్‌తో నేరుగా వైవీయూలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావలన్నారు. మరిన్ని వివరాల కోసం డబ్లూడబ్లూడబ్లూ.వైవీయూ.ఇన్‌ని సందర్శించాలని సూచించారు.


ఎట్టకేలకు ఖాతాల్లోకి ఉపాధి వేతనాలు

సాక్షి ఎఫెక్ట్..

కడప సిటీ: ఉపాధి కూలీల వేతనాలు ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి తమ వ్యక్తిగత ఖాతాల్లో పడటం ప్రారంభమైంది. కనిష్టంగా మూడు వారాలు, గరిష్టంగా ఏడు వారాల వేతనాలు కూలీల ఖాతాల్లో జమ అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం రూ.1600 కోట్లు గత వారంలో మంజూరు చేసింది. అయితే వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యేందుకు ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో జిల్లాకు పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లులు రూ.119 కోట్లు ఉన్నాయి. అంటే దాదాపు 11 వారాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో సాక్షి దినపత్రికలో శుక్రవారం 'అందని వేతనం...గడవని జీవనం' శీర్షికన కథనం ప్రచురించడం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రమే కూలీల వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు పడటంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లోపు ఖాతాల్లో జమ అవుతుంటాయి. అప్పటికి గానీ పూర్తి బిల్లులు వస్తాయో లేదోనన్న విషయం స్పష్టంగా తెలియడం లేదు.

వాటా కోసం వేట

- సెయిల్ కంపెనీకి చుక్కలు చూపిస్తున్న కూటమి నేతలు
- ప్యానెల్స్, ఐరన్, కేబుల్స్, బ్యాటరీలు రాత్రికి రాత్రే మాయం
- కోట్లు విలువైన పరికరాల చోరీ వెనుక నాయకుల ప్రమేయం
- కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్న పోలీసుశాఖ



సాక్షి ప్రతినిధి, కడప: 'రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొదవా' అన్నట్లుగా సంస్థలకు, కాంట్రాక్టర్లకు అధికార పరపతి ఎలా ఉంటుందో జమ్మలమడుగు కూటమి నేతలు రుచి చూపిస్తున్నారు. సంస్థ ఏదైనా సరే వారి కనుసన్నుల్లో నడుచుకుంటే సరే.. లేదంటే అల్లాడిపోవాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు. 40 ఏళ్ల చరిత్ర ఉన్న అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమ నుంచి ఆదానీ ఐడల్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనుల వరకూ నిర్వాహకులు ముప్పుతిప్పలకు గురయ్యారు. తాజాగా టీ.కోడూరు వద్ద నిర్మాణంలో ఉన్న సోలార్ కంపెనీ ఆ జాబితాలో చేరింది. రాత్రికి రాత్రి కోట్లాది విలువైన ప్యానెల్స్, ఐరన్, కేబుల్స్, బ్యాటరీలు మాయం అవుతున్నాయి. కుయ్యో మొర్రో అంటూ సంస్థ ప్రతినిధులు పోలీసులను ఆశ్రయిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకుంటున్న వైనమిది.

రూ.1700 కోట్ల అంచనా వ్యయంతో..
కొండాపురం మండలం టీ.కోడూరు గ్రామ పొలాల్లో సెయిల్ (ఎస్ఏఈఎల్) కంపెనీ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. రూ.1700 కోట్ల అంచనా వ్యయంతో 380 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టేందుకు సిద్ధమైంది. ఆమేరకు 2024లో రైతుల నుంచి 1500 ఎకరాల భూమి 30 ఏళ్లు లీజుకు తీసుకుంది. ప్రభుత్వ అనుమతులు దక్కడంతో 2025 ఫిబ్రవరి నుంచి పనులు ప్రారంభించింది. సెయిల్ కంపెనీ సోలార్ నిర్మాణ పనులు ఓ వైపు కొనసాగిస్తుండగా.. మరోవైపు కూటమి నేతలు చుక్కలు చూపిస్తున్నారు. కొండాపురం మండల బాధ్యుల సహకారంతో టీ.కోడూరు నేతలు ముప్పుతిప్పలు పెడుతున్నట్లు సమాచారం. నిర్మాణ పనులు అప్పగించిన సంస్థకు అనేక సమస్యలు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది.

కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు
సెయిల్ కంపెనీ నిర్మిస్తున్న సోలార్ నిర్మాణ పనుల్లో రాత్రికి రాత్రి సోలార్ ప్యానెల్స్, ఐరన్, కేబుల్స్, బ్యాటరీలు మాయం అవుతున్నాయి. కోట్లాది రూపాయల విలువైన పరికరాలు వరసగా చోరీకి గురవుతున్నాయి. ఇప్పటికీ పలు మార్లు ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇదే విషయమై కంపెనీ ప్రతినిధులు తాళ్లప్రొద్దుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెయిల్ కంపెనీ ప్రతినిధి ఆనంద్ దూబే ఫిర్యాదు మేరకు ఈ నెల 6న క్రైమ్ నంబర్ 154/25 ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్యూరిటీ ఇన్‌చార్జి మహేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు ఈనెల 8న క్రైమ్ నంబర్ 158/25 ఎఫ్ఐఆర్ నమోదు అయింది. ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు కూటమి నేతల ప్రమేయాన్ని గుర్తించారు. వెంటనే రంగ ప్రవేశం చేసిన మండల బాధ్యుడు ఒకరు పోలీసులతో మధ్యస్తం నెరిపారు. 'మీ వాటా మీకు అప్పగిస్తాం, ఎలాంటి చర్యలు చేపట్టవద్దు' అని హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఆపై అధికార పార్టీ నేతల మాట జవదాటని పోలీసు శాఖ.. నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. డబుల్ స్టార్ అధికారి పెద్ద మొత్తంలో దోపిడీదారుల నుంచి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ సంస్థకు మాత్రం ఇప్పటికీ కూటమి నేతల వేధింపులు తప్పడం లేదు.

అదానీ, అల్ట్రాటెక్, సెయిల్‌కు వరుసగా వేధింపులు
జమ్మలమడుగు నియోజకవర్గంలో అదానీ హైడల్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో అధికార పార్టీ నేతలు ప్రత్యక్ష దౌర్జన్యం చేశారు. ఏకంగా సైట్ ఇంజినీర్‌పై దాడి చేశారు. సివిల్ పనులు చేస్తున్న రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు ముప్పుతిప్పలు పెట్టారు. ఆపై అల్ట్రాటెక్ పరిశ్రమపై దృష్టి పెట్టారు. అల్ట్రాటెక్‌లో పూర్తి ఆధిపత్యం కోసం చేయని దందాలు లేవు. అక్కడే టెంటు వేసుకొని సిమెంటు ఉత్పత్తికి ఆటంకం కల్గించారు. ఆమేరకు వ్యవస్థలను అడ్డుపెట్టుకొని దౌర్జన్యం రుచి చూపించారు. ఆర్టీపీపీలో సైతం అలాంటి వ్యవహారమే తెరపైకి వచ్చింది. తాజాగా సెయిల్ సోలార్ ప్లాంట్‌లో నిర్మాణ పరికరాలు చోరీకి గురవుతున్నాయి. కోట్లాది రూపాయల విలువైన పరికరాలు కోల్పోవాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఇలాంటి దుస్సాహసం వెనుక కూటమి నేతల ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం ఉన్నట్లు పరిశీలకులు ఆరోపిస్తుండటం గమనార్హం.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్: భూ సమస్యల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీపై ఆమె డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, సర్వే ల్యాండ్స్ ఏడీ మురళీ కృష్ణతో కలిసి సీఎంవో కార్యాలయం నుంచి అందిన కాల్స్ మేరకు ఆయా డివిజన్ల ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలు, పీవోటీ యాక్ట్ ప్రకారం అసైన్డ్ భూముల పరిష్కారంలో ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని, వచ్చిన ఫిర్యాదులకు సరైన పరిష్కార నివేదికలు అందడం లేదన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా ఫిర్యాదుల పెండింగ్‌పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

ఉల్లి కొనుగోలుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు
జిల్లాలో పండించిన ఉల్లి పంటను రైతులకు నష్టం వాటిల్లకుండా ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడుతోందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి నేరుగా ప్రభుత్వం చేపడుతున్న ఉల్లి పంట కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని ఉల్లి రైతులు, ట్రేడర్లతో ఆమె సమావేశం ఏర్పాటు చేసి, వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టరు మాట్లాడుతూ ఇప్పటికే ప్రారంభమైన మైదుకూరు, కమలాపురం ఉల్లి కొనుగోలు కేంద్రాలను ఆయా ప్రాంత ఉల్లి రైతులు సద్వినియోగం చేసుకునేందుకు అన్ని రకాల సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవి చంద్ర బాబు, జిల్లా మార్క్ ఫెడ్ అధికారి పరిమళ జ్యోతి, మార్కెటింగ్ ఏడీ ఆజాద్ వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కడపలో 4, ప్రొద్దుటూరు 3, రాజంపేట 3, రాయచోటి 3, బద్వేల్ 2, సిద్దవటం, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచి ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్స్: 08562 258622, 244622ను సంప్రదించాలని వివరించారు.

ఉద్యానశాఖ డీడీగా సతీష్

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా ఉద్యాన శాఖ జిల్లా అధికారి(డీడీ)గా సతీష్ నియమితులయ్యారు. ఈయన తిరుపతిలో ఉద్యానశాఖ ఏడీగా పని చేస్తుండగా డీడీగా పదోన్నతి కలిస్తూ వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారు.

వెంకటేశ్వరరెడ్డికి పదోన్నతి: వైఎస్సార్ జిల్లా ఏపీ ఎంఐపీ ఎఫ్ఏసీ పీడీగా పని చేస్తున్న వెంకటేశ్వరరెడ్డికి ఉద్యానశాఖ డీడీగా పదోన్నతి కల్పించారు. ఈయనను వైఎస్సార్ కడప జిల్లాలోని ఏపీఎంఐపీ పీడీగా కొనసాగించనున్నారు.

క్లుప్తంగా

ఓంకారేశ్వర్ కుటుంబానికి ఆర్థికసాయం



అమృతకు ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయురాలు సురేఖ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రామాపురం మోడల్ స్కూలులో ఒకేషనల్ ఐటీ ట్రేడ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓంకారేశ్వర్ కుటుంబానికి సహచరులు ఆర్థికసాయం అందజేసి తమవంతుగా తోడ్పాటు అందించారు. ఓంకారేశ్వర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఈ క్రమంలో స్కిల్ ట్రీ కంపెనీ లిమిటెడ్ ఒకేషనల్ ట్రైనర్స్, ఒకేషనల్ కో ఆర్డినేటర్స్ సహకారంతో రూ. 1,15,000 సేకరించి ఆ మొత్తాన్ని శుక్రవారం మృతుడి సతీమణి అమృతకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థికసాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు సురేఖ, కో ఆర్డినేటర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

8మంది పేకాటరాయుళ్ల అరెస్టు

వేంపల్లె : స్థానిక గండి – పులివెందుల బైపాస్ రోడ్డు సమీపంలో జూదమాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం సీఐ నరసింహులు ఆదేశాల మేరకు గండి – పులివెందుల బైపాస్ రోడ్డు సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ తిరుపాల్ నాయక్ తన సిబ్బందితో దాడులు చేశారు. దీంతో వెంకటరమణతోపాటు మరో 7 మందిని అరెస్టు అదుపులోకి తీసుకుని రూ.82,300 నగదును స్వాధీనం చేసుకోవడంతోపాటు వారిపై కేసు నమోదు చేశామన్నారు.

మునయ్యకోనలో మృతదేహం లభ్యం

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలోని మునయ్యకోనలో చిట్టిబోయిన గంగాధర్(53)అనే వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు.. తొండూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన గంగాధర్ రెండురోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మునయ్యకోనలో అతడి మృతదేహాన్ని గుర్తించారు. మరణానికి చెందని కారణాలు ఇతర వివరాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నిందితులకు జైలు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఫారెస్టు రేంజ్‌లో 2019 ఎర్రచందనం కేసులో తిరుపతి కోర్టులో శుక్రవారం మల్లేపల్లె గ్రామానికి చెందిన నిందితులు కప్పలరమేష్, గురుప్రసాద్‌లకు 5 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

రూ.11లక్షలు మోసం చేసారని కేసు

ముద్దనూరు : మండలంలోని పెద్ద దుద్యాల గ్రామ సమీపంలోని జీయమ్ ఎకో కంపెనీకి చెందిన రూ.11లక్షల 54వేల సొమ్మును మోసం చేసారని కోకా ప్రదీప్, అతని భార్యపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఏఎస్ఐ రమణ సమాచారం మేరకు జీయమ్ ఎకో కంపెనీలో విశాఖపట్టణంకు చెందిన ప్రదీప్ మేనేజర్‌గా, అతని భార్య అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. కంపెనీకి చెందిన లారీల బాడీ తయారీకి గ్యారేజీలో రూ.11లక్షల 54వేల సొమ్మును చెల్లించినట్లు ప్రదీప్ కంపెనీని మోసగించి, డబ్బు చెల్లించినట్లు నకిలీ లావాదేవీల పత్రాలు సృష్టించాడు. కొద్దిరోజుల అనంతరం కంపెనీ ఎండీ కనక ప్రసాద్ గ్యారేజీ ప్రతినిధులను సంప్రదించగా తమకు ఎటువంటి డబ్బు ముట్టలేదని వారు తెలిపారు. ప్రదీప్‌ను విచారించడానికి ప్రయత్నించగా అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వుండడంతో ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బతికుండగానే చంపేశారు

- రూ.2కోట్లు విలువైన ప్రభుత్వ ఉద్యోగి స్థలాన్ని డెత్ సర్టిఫికెట్‌తో అమ్మేశారు
- ఎన్జీఓ ప్లాట్ 300కు సంబంధించి వెలుగుచూసిన సంఘటన

ప్రొద్దుటూరు : బతికుండగానే ప్రభుత్వ ఉద్యోగి చనిపోయినట్లు ఏకంగా డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించి రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని మరొకరికి అమ్మారు. ప్రభుత్వ ఉద్యోగి వీఆర్ఎస్ పొంది ప్రతినెలా పెన్షన్ తీసుకుంటున్నారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఈ సంఘటనను తెలుసుకుని అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. సంఘటన ఎవరు చేశారు.. ఎలా జరిగింది... ఎవరెవరి హస్తం ఉంది అనే వివరాల గురించి ఇప్పటి వరకు సంబంధిత అధికారులు ఆరా తీయలేదు. వివరాలు ఇలా ఉన్నాయి..

ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 1980 ప్రాంతంలో ఎన్జీఓ ప్లాట్లు వేశారు. ప్రస్తుతం ఈ స్థలం విలువ రూ.కోట్లు పలుకుతోంది. ఈ కాలనీలోనే గంజికుంట సుబ్బరాయుడు (నీటి పారుదల శాఖ రిటైర్డు ఎస్ఈ)కు 1986లో సర్వే నంబర్ 194, 196లోని ప్లాట్ నంబర్ 300లోని 7.5 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఆయన గత 40 ఏళ్లుగా తన స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.

డెత్ సర్టిఫికెట్ సృష్టించి...

గంజికుంట సుబ్బరాయుడు నీటి పారుదల శాఖలో ఎస్ఈగా పనిచేసి 2003లో వీఆర్ఎస్ పొంది ప్రభుత్వం నుండి ప్రతి నెల పెన్షన్ తీసుకుంటున్నారు. కర్నూలు నగరంలోని కృష్ణానగర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ నుంచి పెన్షన్ పొందుతున్నారు. గంజికుంట సుబ్బరాయుడు, తన భార్య గంజికుంట వెంకటసుబ్బమ్మ ప్రొద్దుటూరు పట్టణంలోని బుడ్డాయపల్లెలో నివాసం ఉంటున్నారు. ఇది ఇలా ఉండగా.. హైదరాబాద్ నగరంలోని లింగంపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఉన్న (ఆధార్ కార్డు 994947290378) వివరాలతో గంజికుంట సుబ్రహ్మణ్యం ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఈ స్థలాన్ని కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన వద్ది నారాయణ కుమారుడు నాగరాజు (ఆధార్ కార్డు నంబర్ 879824061289)కు రిజిస్టర్ చేయించారు. తన తండ్రి గంజికుంట సుబ్బరాయుడుతోపాటు తల్లి గంజికుంట లక్ష్మీదేవి మరణించినట్లు ఏకంగా మున్సిపాలిటీ నుంచి డెత్ సర్టిఫికెట్లు తీసుకుని జత చేశారు. వాస్తవానికి గంజికుంట సుబ్బరాయుడుకు గంజికుంట సుబ్రహ్మణ్యంకు ఎలాంటి సంబంధం లేదు. ఆయన ఎవరో వీరికి తెలియదు, ఎలాంటి సంబంధాలు లేవు. ఈ ఏడాది ఆగస్టు 13న ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ రిజిస్టర్ జరిగింది. స్టాంప్ రైటర్ తొండలదిన్నె శ్రీనివాసులు ఈ డాక్యుమెంట్‌ను తయారు చేయగా, దొరసానిపల్లెకు చెందిన వరద ఆంజనేయులు, డ్రైవర్ కొట్టాలకు చెందిన నల్లు జయశంకర్ సాక్షులుగా ఉన్నారు. తనకు జరిగిన మోసాన్ని తెలుసుకున్న గంజికుంట సుబ్బరాయుడు కొద్ది రోజుల క్రితం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఈ విషయంపై శుక్రవారం సాయంత్రం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ జీఎస్‌జీ రామదాసును సాక్షి వివరణ కోరగా ఫేక్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు తనకు ఎవరు ఫిర్యాదు చేయలేదన్నారు.



ప్రభుత్వ ఉద్యోగి స్థలాన్ని అమ్మిన వారు, కొన్నవారు



బతికుండగానే గంజికుంట సుబ్బరాయుడు మరణ ధృవీకరణ పత్రం



గంజికుంట సుబ్బరాయుడు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు

అట్టర్‌ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలా?

- అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంలో సూపర్‌హిట్
- పదిహేనేళ్లు ఒక్క మెడికల్ కాలేజీని స్థాపించారా?
- 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల మంజూరు ఘనత వైఎస్ జగన్‌ది
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కూటమి అట్టర్‌ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. కడపలో శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10వ తేదీ కూటమి నేతలు అనంతపురంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' అంటూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి డ్వాక్రా మహిళలను బలవంతంగా తరలించి విజయోత్సవ సభ నిర్వహించడం విచిత్రంగా ఉందన్నారు. పదహారు నెలలుగా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనబెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడంలో.. 5లక్షల పింఛన్లు తొలగించడం, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేయడంలో.. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇవ్వకుండా మోసం చేయడంలో సూపర్ హిట్ సాధించారని ఎద్దేవా చేశారు. 87లక్షల మందికి 'తల్లికి వందనం' ఇవ్వాల్సి ఉండగా, 54లక్షల మందికే ఇచ్చి, 16 నెలల్లో ఒక సిలిండర్ మాత్రమే ఉచితంగా ఇచ్చి, 5 రకాల సర్వీసుల్లోనే ఉచిత బస్సు ప్రయాణం కల్పించి బంపర్‌హిట్ కొట్టారని ఎద్దేవా చేశారు. 'అన్నదాత సుఖీభవ' పథకానికి మొదటి ఏడాది పంగనామం పెట్టారని, రెండో ఏడాది రూ.5వేలు మాత్రమే ఇచ్చి 7లక్షల మందికి కోత వేశారన్నారు. యాభై ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఇస్తామని మోసగించారన్నారు. పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాలను స్థాపించలేదని, ఐదేళ్లు సీఎంగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 కొత్త మెడికల్ కాలేజీలు తీసుకొచ్చి మొనగాడుగా నిలిచారన్నారు. వాటిలో 10 మెడికల్ కాలేజీలను ఈ ప్రభుత్వం ప్రైవేటుకు అమ్మేయాలను కోవడం దారుణమన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలను నిర్వీర్యం చేయడంలో..రైతులకు యూరియా దొరక్కుండా చేయడంలో ఈ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. వలంటీర్ల జీతం పదివేలకు పెంచుతామని చెప్పి ఆ వ్యవస్థనే ఎత్తేశారన్నారు. ప్రభుత్వ బడులు, వైద్యశాలలను.. ఆరోగ్యశ్రీ పథకాన్ని పతనావస్థకు తీసుకుపోయారన్నారు. కూటమి నేతలు విజయోత్సవ సభ నిర్వహించిన జిల్లాలోనే ఓ టీడీపీ ఎమ్మెల్యే జూనియర్ ఎన్టీఆర్ తల్లిని తీవ్రంగా అవమానిస్తే అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు దక్కిన గౌరవం ఇదేనని ఎద్దేవా చేశారు. ఇక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు బీహెచ్ ఇలియాస్, టీపీ వెంకటసుబ్బమ్మ, జమీల్, అజ్మతుల్లా, త్యాగరాజు, బసవరాజు, కంచుపాటి బాబు, అహ్మద్ పాల్గొన్నారు.

కబ్జా ఆరోపణలు నిరాధారం

బద్వేలు నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల అధ్యక్షుడు కె.రమణారెడ్డి



మాట్లాడుతున్న కె.రమణారెడ్డి

కలసపాడు : తనపై వచ్చిన కబ్జా ఆరోపణలు నిరాధారమని బద్వేలు నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల అధ్యక్షుడు కె.రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్ళలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తనపై కొన్ని ఛానెళ్ళలో, పత్రికల్లో తాను కబ్జాలకు పాల్పడినట్లు, ఆలయ భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు కథనాలు ప్రచురించడం చాలా బాధాకరమన్నారు. తన 20 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వెంట నడుస్తూ వైఎస్సార్ కుటుంబానికి విధేయుడుగా ఉంటూ బద్వేలు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ బద్వేలు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా తన భార్యను మొట్టమొదటిసారిగా చేశారన్నారు. తాను వైస్ చైర్మన్‌గా ఉండి రూ.10 కోట్లతో నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 20 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఒక ఎకరా డీకేటీ భూములు పొందడం గాని వాగులు, వంకలు కబ్జా చేయలేదన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించలేదని తెలిపారు. తాను అంచెలంచెలుగా కష్టపడి తన వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తుకున్నానే తప్ప అవినీతి, అక్రమాలకు పాల్పడలేదన్నారు. రంగసముద్రం పంచాయతీ సర్వే నెంబర్ 930/2 లో 35 సెంట్ల స్థలాన్ని కబ్జాకు పాల్పడినట్లు రామచంద్రారెడ్డి, బైరిశెట్టిశ్రీనివాసులు తనపై ఆరోపించారన్నారు. తాను 90 సెంట్ల స్థలాన్ని గంగాధరఆచారి, నిజాముద్దీన్, రామకృష్ణారెడ్డిల వద్ద కొనుగోలు చేశానని, ఆ భూమిని ఇతరులకు విక్రయించగా గంగాధరఆచారి వారికి రిజిస్ట్రేషన్ కూడా చేశారన్నారు. బైరిశెట్టిశ్రీనివాసులు, రాఘవేంద్రరెడ్డి అక్రమంగా రిజిస్ట్రేషన్ పొంది లేని భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. తనకు దేవాలయానికి సంబంధించిన స్థలానికి, నాకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. తనపై అసత్య ఆరోపణలు చేసిన ఛానెళ్ళు, పత్రికలు వారం లోపల తనకు సంజాయిషీ ఇవ్వాలని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సింగమాలవెంకటేశ్వర్లు, గుండంహనుమంతరెడ్డి, రాళ్లపల్లినరసింహులు, జగన్‌మోహన్‌రెడ్డి, చాపాటిసాయినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆసక్తికరంగా క్రీడా ఎంపికలు జరుగుతున్నాయి. శుక్రవారం నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్–14,17 బాల బాలికలకు రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించారు. టెన్నిస్, టేబుల్ టెన్నిస్, ఊషు, తంగట, ఖురేష్ వంటి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి ఈ క్రీడలను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి ఈ ఎంపికలకు 14 సంవత్సరాల, 17 సంవత్సరాల విభాగాల నుంచి దాదాపు 350 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీకాంత్ రెడ్డి, చంద్రావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కిరణ్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అమరావతి క్వాంటం వ్యాలీకి ఎంపిక



రాష్ట్రస్థాయి క్వాంటం వ్యాలీకి ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : రాష్ట్రస్థాయి అమరావతి క్వాంటం వ్యాలీకి ఇడుపులపాయి ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈనెల 10వ తేదీన రీజనల్, జోనల్ స్థాయి అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్‌లో సత్తా చాటారు. గతనెల 28వ తేదీన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ లో జరిగిన ఇంటర్నల్ క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెండు జట్లను తిరుపతిలోని మహిళా యూనివర్సిటీకి పంపగా, అక్కడ కూడా ఆ రెండు టీంలు సత్తా చాటి రూ.10వేల క్యాష్ అవార్డుతోపాటు ప్రశంసా పత్రంను అందుకున్నారు. ఈ రెండు టీంలలో సుమారు 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను ఆకాంక్షించారు.

15న సీనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 15న జిల్లా స్థాయి సీనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ పురుషులు, మహిళల జట్లు ఎంపికలను నిర్వహిస్తుననట్లు పురుషోత్తం రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు కడప నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీలల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9966211903 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైద్యరంగంలో జనరల్ మెడిసిన్‌కు ప్రత్యేక స్థానం



మాట్లాడుతున్న వైద్య అధ్యాపక బృందం

కడప అర్బన్ : వైద్యరంగంలో జనరల్ మెడిసిన్‌కు ప్రత్యేక స్థానం వుందని ఏపీఐ చైర్మన్ డాక్టర్ మనోజ్ కుమార్ తెలియజేశారు. ఏపీకాన్ –2025 ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ఆవరణంలో 53వ వార్షిక అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఇండియా వారి ఏపీ స్టేట్ ఏపికాన్ –2025 సదస్సు నిర్వహణకు ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమం నిర్వహణలో భాగంగా పీజీ వైద్య విద్యార్థులు వివిధ కేటగిరిలలో తాము ప్రెజెంటేషన్ చేయాలనుకున్న అంశాలను జనరల్ మెడిసిన్ వైద్యాధికారుల ముందు తెలియజేశారు. తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమాలను జాతీయ స్థాయి 53వ కాన్ఫరెన్స్‌గా కడప నగర శివార్లలోని రాయచోటి రోడ్డులో వున్న మాధవి కన్వెన్షన్ హాల్‌లో 13, 14 తేదీలలో జాతీయ స్థాయిలో అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. కార్యక్రమాలను డాక్టర్ టి. మునీశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్‌గా డాక్టర్ యాదవేంద్రారెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ అర్జున్‌కుమార్ వ్యవహరించనున్నారు.

పేద విద్యార్థుల డాక్టర్ కలను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ



బద్వేలు అర్బన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి పేద విద్యార్థులు డాక్టర్ కావాలనే కలను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు డాక్టర్ కావాలనే కలను నెరవేర్చడంతో పాటు ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వసతులతో అత్యుత్తమ వైద్యం అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి వాటిని పూర్తి చేసి కొన్నింటిలో తరగతులు సైతం ప్రారంభించారని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు కేవలం 11 ప్రభుత్వ వైద్యకళాశాలలే ఉండేవని, తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందవన్న ఉద్దేశ్యంతో కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే వాటిని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పేదల పక్షాన ఆలోచించి ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలలను కొనసాగించాలని కోరారు.

ప్రమాదమా.. హత్యాయత్నమా..?

- జేఎన్‌టీయూ హాస్టల్ వార్డెన్‌కు తీవ్ర గాయాలు
- అందుబాటులోకి రాని 108 వాహనం



రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆనందరావు

పులివెందుల : పట్టణంలోని ఎర్రగుడిపల్లెకు చెందిన ఆనందరావు పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆనందరావు జేఎన్‌టీయూ సమీపంలో తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన తన ద్విచక్ర వాహనంతో సహా గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీన్ని గమనించిన స్థానికులు అతడిని కాపాడే ప్రయత్నాలు చేశారు. పోలీసు సిబ్బందికి, 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. దీంతో పులివెందుల ట్రైనింగ్ ఎస్ఐ అనిల్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును చూస్తే ఆనందరావు బైకు అదుపు తప్పి ప్రమాదం జరిగిందా లేకపోతే ఎవరైనా వ్యక్తులు దాడి చేశారా అనేది అనుమానాం కలుగుతోంది. స్థానికులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

అందుబాటులోకి రాని 108 వాహనం :

జేఎన్‌టీయూ సమీపంలో తీవ్రంగా గాయపడిన ఆనందరావును స్థానికులు గుర్తించి 108 వాహనానికి ఫోన్ చేశారు. అయితే సంఘటన జరిగిన అర్థ గంటసేపు అయినా కూడా 108 వాహనం చేరుకోలేదు. దీంతో స్థానికులు, పోలీసులు అటువైపు వస్తున్న వాటర్ క్యాన్ ఆటోలో క్షతగాత్రుడిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆనందరావు పూర్తిగా మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాడు. ఆనందరావు కోలుకుంటే ప్రమాదమా.. హత్యాయత్నమా అనే విషయాలు తెలిసే అవకాశం ఉంది. ఈ విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ సీతారామిరెడ్డి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి చేరుకుని సంఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

ప్రమాదవశాత్తూ కాలు జారిపడి బేల్దారి మృతి

ఎర్రగుంట్ల : పట్టణంలోని వినాయకనగర్ కాలనీలో నివాసం ఉండే భవన నిర్మాణ కార్మికుడు మేష జాన్ (21) ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా.. కడప రోడ్డులోని ఓ భవన నిర్మాణం పనులకు మేషజాన్ వెళ్లాడు. పై అంతస్తులో పనులు చేస్తుండుగా ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడి మృతి చెందాడు. మృతుడు తల్లి ప్రకాశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జూనియర్ కబడ్డీ ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా క్రీడల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న కబడ్డీ ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి బాలికలు 150 మంది, బాలురు 200 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కిరణ్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరి శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరి చంద్రావతి, జిల్లా కబడ్డీ ప్రెసిడెంట్ గురుశేఖర్, సెక్రటరి సుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవాణి, ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రటరి చంద్రహాజరాజు, విక్టర్ కోచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి కబడ్డీ పోటీలకు ఎంపికైనది వీరే..

బాలురు జట్టు : వేణుసాయి, దుర్గశంకర్, బ్రహ్మయ్య, నూర్ భాష, మల్లిఖార్జున, కలాం, సాయి ప్రసాద్, యశ్వంత్, జయంత్ నాయక్, హుస్సేన్, మల్లిఖార్జున, నరేంద్ర, జశ్వంత్, గఫార్ బాషా.

బాలికల జట్టు : జ్యోత్స్న, నీల మహేశ్వరి, రంగ శివజ్యోతి, సునీత, పల్లవి, సిఎం రామలక్ష్మి, వర మేఘన, హేమ ప్రియ, షషీనా, మైథిలి, అయ్యవారమ్మ, గంగాదేవి, అనిత, కృపా జ్యోతి.

రాజకీయ జోక్యంతో విచారణ మమ

- కొండను తవ్వి ఎలుకను పట్టిన అధికారులు
- వచ్చారు 6ఏ కేసు పెట్టి సరిచేసి వెళ్లారు..



మహానందీశ్వర ట్రేడర్స్ మొదటి గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేడీఏ చంద్రానాయక్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : దువ్వూరులో గురువారం రాత్రి యూరియా అక్రమంగా తరలిస్తుండటంపై 'రాత్రి అక్రమంగా యూరియా తరలింపు' అనే శీర్షికతో శుక్రవారం సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై విచారణ చేయడానికి జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) చంద్రానాయక్, మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, ఏఓ అమరనాథరెడ్డి, దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ముందుగా ఏడీఏ కృష్ణమూర్తి శ్రీమహానందీశ్వర ట్రేడర్స్ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. విచారణ ప్రారంభంలో జాయింట్ కలెక్టర్ షాపును సీజ్ చేయమని చెప్పారని, తప్పు ఎవరు చేసినా ఉపేక్షించొద్దని చెప్పారని ఏడీఏ మీడియాతో చెప్పుకొచ్చారు. అనంతరం జేడీఏ చంద్రానాయక్ షాపు వద్దకు వచ్చారు. జేడీఏతో ఏడీఏ కృష్ణమూర్తి, ఏఓ అమరనాథ్ రెడ్డిలు ఈ ట్రేడర్స్‌కు గురువారం సాయంత్రం 9 టన్నుల యూరియా వచ్చిందన్నారు. ప్రస్తుతం 7.8 టన్నుల యూరియా నిల్వ ఉందని, 1.2 టన్నుల యూరియాను గురువారం రాత్రి అక్రమంగా విక్రయించినట్లు తెలిపారు. జేడీఏ వ్యవసాయాధికారులతో కలిసి ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న ఆ షాపు గోడౌన్ వద్దకు చేరుకుని అక్కడ ఉన్న యూరియా బస్తాలను లెక్కించారు. మొదట 77 బస్తాల యూరియాను అక్రమంగా అమ్మినట్లు గుర్తించారు. నాటకీయ పరిణామాల మధ్య అకస్మాత్తుగా 57 బస్తాలు తక్కువ ఉన్నాయని, 30 బస్తాల యూరియా మరో గోడౌన్‌లో ఉన్నాయని అధికారులు కొత్త కథ చెప్పుకొచ్చారు. ఈ ట్రేడర్స్‌కు చెందిన మరొక గోడౌన్‌ను తనిఖీ చేయడానికి అధికారులు వెళ్లారు. అక్కడికి వెళ్లాక జేడీఏ, ఇతర వ్యవసాయాధికారులు 45 నిమిషాలు వేచివున్నా కూడా ట్రేడర్స్ వారు తాళాలు తీయలేదు. చివరకు వ్యవసాయాధికారులు తాళాలు తెప్పించి ఆ గోడౌన్‌ను తనిఖీ చేయగా రాజకీయ జోక్యంతో నాటకీయ పరిణామాల మధ్య అధికారులు మహానందీశ్వర ట్రేడర్స్‌పై అమితమైన ప్రేమనుకనబరిచి లేదు కేవలం 27 బస్తాలు మాత్రమే తక్కువగా ఉన్నాయని క్లీన్ చిట్ ఇవ్వడం గమనార్హం. ఆ 27 బస్తాల యూరియా అతను బ్లాక్ మార్కెట్‌కు తరలించలేదని, అది కూడా వారికి తెలిసిన రైతులకు డీబీటీ ప్రకారం ఇచ్చారని అధికారులు చెప్పడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. గురువారం సాయంత్రం ఆ షాపుకు 9 టన్నుల యూరియా వస్తే అదే రోజు రాత్రి యూరియాను అక్రమంగా తరలిస్తుండగా రైతులు నిలదీశారు. కానీ వ్యవసాయాధికారులు షాపు వారు డీబీటీ ప్రకారం యూరియాను ఎత్తించారనడం కొస మెరుపు. మొత్తం మీద విచారణను మసి పూసి మారేడు కాయ చేసి తూ.తూ. మంత్రంగా ఉన్న యూరియాను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి ఆ ట్రేడర్స్‌పై భక్తిని చాటుకుని విచారణను మమ అనిపించారు. అధికారులు అనుకుంటే ఏమైనా చేయగలరని ప్రజలు చెప్పుకుంటున్నారు. అధిక ధరలకు యూరియా అమ్ముతున్నారని పత్రికల్లో కథనాలు వస్తున్నా విచారణకు వచ్చిన వ్యవసాయాధికారులు అధిక ధరలపై ఒక్క షాపుపై కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు చర్చించుకుంటున్నారు.